సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

తల్లుల సహనానికి పరీక్ష

- గందరగోళంగా 'తల్లికి వందనం' అమలు
- స్కూళ్లు, బ్యాంకులు, సచివాలయాల చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు
- తూతూ మంత్రంగా ముగిసిన గ్రీవెన్స్
- సచివాలయాల్లో అందుబాటులో లేని సిబ్బంది
- నిరాశగా వెనుదిరిగిన విద్యార్థుల తల్లులు
- మరికొన్ని రోజులు గ్రీవెన్స్ పొడిగించాలని విజ్ఞప్తి


ఫోన్‌కు వచ్చిన మెసేజ్ చూపిస్తున్న మహిళ


దాడి రామ్మూర్తి కల్యాణ మండపంలో శుక్రవారం తాళాలు వేసి ఉన్న సచివాలయాలు

సీతంపేట: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన తల్లికి వందనం పథకం అమలు గందరగోళంగా మారింది. అర్హులైన వారి నుంచి ఎటువంటి దరఖాస్తులు స్వీకరించకుండా, ఎలాంటి పరిశీలన చేయకుండా.. ఏ డేటా ఆధారంగా లబ్ధిదారులను గుర్తించారో పాలకులకే తెలియాలి. ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం రూ.15 వేలు చొప్పున వేస్తామని ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని విద్యార్థుల తల్లుల ఆవేదన చూస్తే తెలుస్తోంది. డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ కాకపోవడంతో తల్లులు స్కూల్స్, బ్యాంకు, సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. స్కూల్‌కు వెళ్తే తమ వద్ద డేటా లేదని, సచివాలయానికి వెళ్లమని ఉపాధ్యాయులు చెబుతున్నారు. సచివాలయానికి వెళ్తే కారణాలు చెప్పేందుకు సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు.

ముగిసిన గ్రీవెన్స్ గడువు..

ఈ నెల 20తో గ్రీవెన్స్ గడువు ముగిసింది. యోగాంధ్ర కార్యక్రమ విధులకు సచివాలయం సిబ్బందిని వేయడంతో 19, 20 తేదీల్లో వారు అందుబాటులో లేక లబ్ధిదారులు ఇబ్బంది పడ్డారు. గడువు ముగియడంతో గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకునే వీలులేకుండా పోయిందని, యోగాంధ్ర కారణంగా రెండు రోజులు వృథాగా పోయాయని తల్లులు వాపోతున్నారు.

ఈ నెల 21 నుంచి 28 వరకు గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు పరిశీలించి అర్హుల జాబితా ప్రకటించనున్నారు. గ్రీవెన్స్ మరి కొన్ని రోజులు పొడిగిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని తల్లులు కోరుతున్నారు. తోటి పిల్లలకు డబ్బులు జమై, కొంత మందికి డబ్బులు బ్యాంకులో పడకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అర్హులైన వారి నుంచి ముందుగా దరఖాస్తులు స్వీకరించి, పరిశీలించి బ్యాంకులో డబ్బులు జమచేస్తే ఇలా సచివాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరిగే బాధ తప్పేదని తల్లులు మండిపడుతున్నారు.


సిబ్బంది లేక ఖాళీగా దర్శనమిస్తున్న 241 సచివాలయం

అందుబాటులో లేని సచివాలయ సిబ్బంది

ఈ నెల 12న తల్లికి వందనం పథకం అర్హుల జాబితాలు సచివాలయాల్లో ప్రదర్శించారు. 13వ తేదీ నుంచి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ కావడం మొదలయ్యాయి. డబ్బులు పడనివారు కారణాలు తెలుసుకుందామంటే శని, ఆదివారాలు సెలవులు కావడంతో సోమవారం తల్లులు సచివాలయాల బాటపట్టారు. డబ్బులు పడని తల్లులు ఆధార్ కార్డులతో సచివాలయాల వద్ద క్యూలు కట్టారు. సరైన సమాధానం రాక నిరాశతో వెనుదిరిగారు. డబ్బులు జమకాని వారి నుంచి సోమవారం గ్రీవెన్స్ నమోదు చేయాలని ఆదేశించినా సచివాలయాల్లో ఆ పరిస్థితి కనిపించలేదు. పథకం గురించి చెప్పాల్సిన వెల్ఫేర్ సెక్రటరీలు, ఎడ్యుకేషన్ సెక్రటరీలు సచివాలయాల్లో అందుబాటులో లేక ఇబ్బందులకు గురయ్యారు. అక్కయ్యపాలెం దాడి రామ్మూర్తి కల్యాణ మండపంలో మూడు సచివాలయాలున్నాయి. ఈ నెల 12 నుంచి 20 వరకు గ్రీవెన్స్ నిర్వహించాల్సి ఉంది. గురు, శుక్రవారాల్లో సచివాలయ సిబ్బంది అందుబాటులో లేరు. యోగాంధ్ర విధులకు హాజరు కావడంతో సిబ్బంది లేక సచివాలయాలకు తాళాలు వేసేశారు. తల్లికి వందనం డబ్బులు పడని వారు గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేయడానికి వచ్చి, సచివాలయాలకు తాళాలు చేసి ఉండటంతో ఉసూరుమంటూ వెనుదిరిగారు. జవాబు చెప్పాల్సిన సచివాలయ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో తమకు డబ్బులు వస్తాయో రావో అని తల్లులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

'తల్లికి వందనం' డబ్బులు పడలేదు

నాకు పాప, బాబు ఉన్నారు. ఇద్దరికీ రూ.13 వేల చొప్పున రూ.26 వేలు వస్తాయనుకున్నాను. ఇప్పటి వరకు డబ్బులు పడలేదు. పాపకు మాత్రం డబ్బులు పడతాయని సెల్‌ఫోన్‌కు మెసేజ్ మాత్రం వచ్చింది. ఇంకా పడలేదు. ఎందుకు పడలేదని అడుగుదామని సచివాలయానికి వెళ్తే సిబ్బంది అందుబాటులో లేరు. బాబు ఇంటర్ చదువుతున్నాడు. డబ్బులు పడతాయని మెసేజ్ కూడా రాలేదు. తోటి పిల్లలకు డబ్బులు పడ్డాయి. మాకు ఎందుకు పడలేదో అర్థం కావడం లేదు.

– ఎస్.కల్పన, యలమంచిలి వారి వీధి

ఆశగా ఎదురుచూస్తున్నాం



నా మనవరాలు దేవి ఏడో తరగతి చదువుతోంది. తల్లికి వందనం డబ్బులు పడలేదు. సచివాలయంలో అడిగితే బ్యాంకు ఖాతాకు ఆధార్, ఫోన్ నంబర్ లింక్ చేయాలని చెప్పారు. బ్యాంకుకు వెళ్లి లింక్ చేయించాం. సోమవారం డబ్బులు పడతాయంటున్నారు. చాలా ఆశగా ఎదురు చూస్తున్నాం.

– ఎం.అప్పయ్యమ్మ, సీతంపేట

క్లుప్తంగా

నేడు వైభవుడికి సుప్రభాత సేవ


వైభవ వేంకటేశ్వర స్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో కొలువైన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

తాగునీరు వృథా


అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్‌లో వృథాగా పోతున్న తాగునీరు

సీతంపేట: స్థానిక అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్‌లో నాలుగు రోజులుగా తాగునీరు వృథాగా పోతోంది. 24/7 నీటి సరఫరా కోసం జరుగుతున్న అమృత్ 2.0 పనుల్లో భాగంగా అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్‌ను తవ్వారు. రహదారిని తవ్వినపుడు వాటర్ పైపులైన్ దెబ్బతినడంతో నాలుగు రోజులుగా తాగునీరు వృథాగా రోడ్డుపై నుంచి ప్రవహిస్తోంది. పైపులీకును అరికట్టాల్సిన సిబ్బంది పత్తా లేకుండా పోయారు. శ్రీనివాసనగర్, నందగిరినగర్, గోపీలపాలెం ప్రాంతంలో నీటి ఎద్దడితో ఇబ్బంది పడుతుంటే, ఇక్కడ మాత్రం నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని జనం మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, నీటి వృథాను అరికట్టేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

యువకుడి అదృశ్యం


సత్యనారాయణ

మద్రిపాలెం: మతిస్థిమితం లేని ఓ యువకుడి అదృశ్యంపై కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం సంతోషిమాత ఆలయ సమీపంలో నివసిస్తున్న గెడ్డ సత్యనారాయణ అనే యువకుడు కొంతకాలంగా మతిస్థిమితం లేక పలుమార్లు ఇంటి నుంచి బయటకు వెళ్తా వచ్చేస్తూ ఉండేవాడు. ఈ నెల 9న ఇంటి నుంచి వెళ్లిన యువకుడు ఇంతవరకూ తిరిగి చేరుకోలేదు. చాలా చోట్ల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో సత్యనారాయణ తల్లి గున్న కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ చంద్రశేఖర్ నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ అబద్దం కేసు దర్యాప్తు చేపట్టారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆందోళన


నిరసన తెలుపుతున్న కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ప్రతినిధులు

డాబాగార్డెన్స్: మిరాజ్ సినిమా హాల్‌లో పనిచేస్తున్న గిరిజన మహిళను కులం పేరిట దుర్భాషలాడి, అవమానించిన జ్యోతి, వెంకటేష్‌లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద నిరసన చేపట్టారు. సంఘం ఉపాధ్యక్షుడు వై.రాజు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, గిరిజనులు, మైనార్టీలపై విపరీతంగా దాడులు పెరిగాయన్నారు. గత ప్రభుత్వంలో దళితులు, గిరిజనులు, మైనార్టీలపై దాడులు పెరిగాయని, మేము అధికారంలోకి వచ్చాక వీళ్లందరికీ న్యాయం చేస్తామని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. అయితే కూటమి ప్రభుత్వ హయాంలో మరింతగా దాడులు పెంచి అన్యాయం చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా దళితులపై దాడులు ఎక్కువయ్యాయన్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గంలో మహిళను చెట్టుకి కట్టి కొట్టిన సంఘటనే ఉదాహరణగా పేర్కొన్నారు. సిటు జగదాంబ జోన్ నాయకులు ఎం.సుబ్బారావు, కర్రి చంద్రశేఖర్, కార్మికులు పాల్గొన్నారు.

'కూటమి' ఏడాది పాలనంతా మోసాలే..


'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం' పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం సంజీవయ్య కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ వార్డు అధ్యక్షుడు కుందిరి సుకుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం' పోస్టర్‌ను సీనియర్ నాయకుడు రాఘవులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం నూటికి నూరు శాతం విఫలమైందన్నారు. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తొలి ఏడాదిలోనే మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 90 శాతానికి పైగా అమలు చేశారని గుర్తుచేశారు. వార్డులో పార్టీ బలోపేతానికి సమష్టి కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి కృపా, నార్త్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు లక్ష్మణ్, సురేష్, రమేష్, అనిల్, కనకరాజు, జగ్జీవన్, గంగరాజు, కాంతారావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా యోగా సాధన కార్యక్రమాలు


యోగా సాధనలో పాల్గొన్న అనురాగ్ మాంటిస్సోరి స్కూల్ చిన్నారులతో ఈకార్వో ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: అంతర్జాతీయ యోగా దినోత్సవం–2025లో భాగంగా వాల్తేర్ డివిజన్ పరిధిలో ఈ నెల 16 నుంచి 21 వరకు నిర్వహిస్తున్న పలు ప్రత్యేక కార్యక్రమాలు ముగింపు దశకు చేరకున్నాయి. వీటిలో భాగంగా శుక్రవారం డివిజన్ పరిధిలోని రైల్వే కాలనీలు, రైల్వే స్టేషన్లు, రైల్వే కార్యాలయాల వద్ద అవగాహన ర్యాలీలు చేశారు. ఈ కార్య క్రమాల్లో క్రీడాకారులు, రైల్వే అధికారులు, స్కౌట్స్ అండ్ గైడ్స్, సివిల్ డిఫెన్స్ బృంద సభ్యులు, రైల్వే ఉద్యోగుల కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ప్రెసిడెంట్ జ్యోత్స్న బోరా ఆధ్వర్యంలో అనురాగ్ మాంటిస్సోరి స్కూల్ విద్యార్థులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఈకార్వో ప్రతినిధులు పాల్గొన్నారు.

వాటర్ ఫౌంటెయిన్‌ను మూసేసిన టీడీపీ జెండాలు


మహారాణి పార్లర్ జంక్షన్‌లో ఫౌంటెయిన్ చుట్టూ కట్టి వదిలేసిన టీడీపీ జెండాలు

సీతంపేట: కూటమి ప్రభుత్వ పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. దీనిలో భాగంగా అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డు, మహారాణి పార్లర్ కూడలిలోని వాటర్ ఫౌంటెయిన్‌కు టీడీపీ జెండాలు కట్టారు. ఫౌంటెయిన్ కనిపించకుండా మొత్తం పార్టీ జెండాలతో నింపేశారు. వేడుకలు ముగిసి వారం రోజులు గడిచినా వాటిని మాత్రం తొలగించలేదు. సాధారణంగా వేడుకలు ముగిశాక జెండాలు తొలగిస్తుంటారు. లేదంటే జీవీఎంసీ సిబ్బంది వాటిని తొలగించాల్సి ఉంది. వారం గడిచినా టీడీపీ జెండాలు మాత్రం అలాగే దర్శనమిస్తున్నాయి. ప్రతిపక్ష పార్టీలకు చెందిన జెండాలు, ఫ్లెక్సీలను 24 గంటల్లోనే తొలగించే జీవీఎంసీ సిబ్బంది, అధికార పార్టీ జెండాలను మాత్రం వారం రోజులు గడిచినా ఎందుకు తొలగించలేదో వారికే తెలియాలి. గత ప్రభుత్వం కోట్లు వెచ్చించి అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డును వెడల్పు చేసి, ఫుట్‌పాత్‌లు, సెంటర్ మీడియన్ నిర్మించింది. బ్యూటిఫికేషన్‌లో భాగంగా మహారాణి పార్లర్ కూడలిలో లైటింగ్‌తో అందమైన వాటర్ ఫౌంటెయిన్ నిర్మించింది. దాన్ని మూసివేసేలా ఉన్న టీడీపీ జెండాలను తొలగిస్తే బాగుంటుందని, సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మాదక ద్రవ్యాల నిరోధానికి కృషి


విశాలాక్షినగర్ సీఆర్‌పీఎఫ్ కార్యాలయ ఆవరణలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

ఆరిలోవ: నాషాముక్త్ భారత్ పఖ్వాడా ఆధ్వర్యంలో శుక్రవారం విశాలాక్షినగర్‌లోని సీఆర్‌పీఎఫ్ 198 బి.ఎస్.కార్యాలయ ఆవరణలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథి సీఆర్‌పీఎఫ్ సెకెండ్ ఇన్ కమాండ్–198 బి.ఎస్.మహ్మద్ రాజి ఇక్కడి సిబ్బందితో మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా గురించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. నాషాముక్త్ భారత్ పఖ్వాడా గురించి అందరూ ఐక్యతతో సమాజంలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మాదక ద్రవ్యాల వ్యాప్తిని అరికట్టడానికి సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్–198 బి.ఎస్.డిప్యూటీ కమాండెంట్ భగత్‌సింగ్, సుబేదార్ మేజర్ వంజీవ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ బి.రవికుమార్, మినిస్టీరియల్ ఇన్‌స్పెక్టర్ షర్మిలా శర్మ, సబ్ ఇన్‌స్పెక్టర్ విక్రమ సింగ్, ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారుల దిగ్బంధం

- ప్రధాన మార్గాల్లో బస్సుల పార్కింగ్
- రాకపోకలకు అవస్థలు


బుల్లయ్య కళాశాల వద్ద స్పెన్సర్స్ రోడ్‌లో నిలిపిన బస్సులు


రామాటాకీస్ రోడ్‌లో కంటి ఆస్పత్రి వద్ద బస్సుల పార్కింగ్


డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం ఎదుట నిలిపిన బస్సులు


80 అడుగుల రోడ్‌లో బస్సుల పార్కింగ్

సీతంపేట: నగరంలోని ప్రధాన రహదారులన్నింటినీ బస్సులతో నింపేశారు. యోగాంధ్రలో పాల్గొనేందుకు విద్యార్థులను తీసుకువచ్చిన బస్సులను ప్రధాన రహదారుల్లో పార్క్ చేసి దిగ్బంధనం చేశారు. ఏయూ గ్రౌండ్‌లో శుక్రవారం సాయంత్రం గిన్నిస్ రికార్డు సాధనకు గిరిజన ప్రాంతాల నుంచి విద్యార్థులను బస్సుల్లో తీసుకువచ్చారు. విశాఖ మన్యం, అల్లూరి జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఈ బస్సుల్లో వచ్చారు. ఆయా బస్సులను బుల్లయ్య కళాశాలకు ఇరువైపులా ఉన్న రహదారులు, అలాగే ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రి, రామాటాకీస్ రోడ్, డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయం ఎదుట బస్సులను పెద్ద సంఖ్యలో పార్క్ చేశారు. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రహదారుల్లో బస్సులను మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు నిలిపివేయడంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. అలాగే సీతంపేట మెయిన్‌రోడ్, అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్, 80 అడుగుల రోడ్డుల్లో బస్సులను నిలపడంతో ట్రాఫిక్ ఇబ్బందులతో జనం అవస్థలపాలయ్యారు.

యోగాంధ్రకు 12 వేల మంది జూ. కళాశాలల విద్యార్థులు

మద్దిలపాలెం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల నుంచి 12,800 మంది విద్యార్థులు 'యోగాంధ్ర' కార్యక్రమంలో పాల్గొంటున్నారని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి మురళీధర్ తెలిపారు. వీరిని తరలించడానికి 238 బస్సులు కేటాయించారు. ప్రతి బస్సుకు ఒక జూనియర్ లెక్చరర్‌ను ఇన్‌చార్జిగా, 19 మంది ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాళ్లను నోడల్ అధికారులుగా నియమించారు. 88 బస్సుల్లో 4,466 మంది ఏయూ గ్రౌండ్‌లో జరిగే 'యోగాంధ్ర'లో 4 కంపార్ట్‌మెంట్లలో పాల్గొంటారు. వీరికి ఏడుగురు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాళ్లు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారు. మిగిలిన 150 బస్సుల్లో 8,352 మంది విద్యార్థులు గీతం మెడికల్ వద్దకు చేరుకుని 6 కంపార్ట్‌మెంట్లలో పాల్గొంటారు. వీరికి 12 మంది ప్రిన్సిపాళ్లు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారు. వీరంతా విద్యార్థులను వారి కేటాయించిన కంపార్ట్‌మెంట్లకు చేర్చడం, తిరిగి బస్సుల వద్దకు తీసుకురావడం వంటి బాధ్యతలు చూసుకుంటారు.

సిరులతల్లికి క్షీరాభిషేకం


క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహిస్తామని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. రూ.500 చెల్లించిన దంపతులు లేదా ఇద్దరు భక్తులను పూజలో పాల్గొనవచ్చని చెప్పారు. వివరాలకు 0891- 2566514, 2711725 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు తులసీ పూజ..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసిపూజ నిర్వహించనున్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించాలని ఈవో తెలిపారు.

యోగా దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన సీఎస్


బీచ్ రోడ్డులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయానంద్

మహారాణిపేట: బీచ్ రోడ్డులో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమ ఏర్పాట్లను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ శుక్రవారం పరిశీలించారు. ప్రధాన వేదిక, కంపార్ట్‌మెంట్లు, ఎల్ఈడీ స్క్రీన్, సౌండ్ సిస్టమ్‌లను ఆయన పరిశీలించి, అధికారులకు తగు సూచనలు చేశారు. అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా, సమన్వయంతో పనిచేయాలని, ఎటువంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సీఎస్ ఆదేశించారు. పర్యటనలో వైద్యారోగ్యశాఖ కమిషనర్ వీరపాండ్యన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 1.50 లక్షల ప్రదేశాల్లో యోగా ప్రదర్శనలు

రాష్ట్రంలోని సుమారు లక్షా యాభై వేల ప్రదేశాల్లో శనివారం యోగా ప్రదర్శనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని యోగాంధ్ర నోడల్ అధికారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి కృష్ణబాబు తెలిపారు. విశాఖపట్నంలో ప్రధాని, సీఎం, ఉపముఖ్యమంత్రితో పాటు ఇతర మంత్రులు యోగా ప్రదర్శనలో పాల్గొంటారని, అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా లక్షన్నర ప్రదేశాల్లో ప్రదర్శనలు జరుగుతాయని ఆయన వివరించారు. ఇది ఒక సరికొత్త రికార్డు అని పేర్కొన్నారు. సుమారు పదివేల వాహనాల్లో మూడు లక్షలకు పైబడి ప్రజలు పాల్గొనేలా ఏర్పాట్లు చేసినట్లు, ఏయూ గ్రౌండ్‌లో 25 వేల మంది విద్యార్థులతో 15 నిమిషాలపాటు సూర్య నమస్కారాలు చేయడం ద్వారా మరో కొత్త రికార్డును సృష్టిస్తున్నామని కృష్ణబాబు వెల్లడించారు.







